క్లుప్తంగా

మెస్ మూసివేతపై ఆందోళన



ప్రిన్సిపాల్‌ను నిలదీస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ హెచ్ బ్లాక్‌లోని మెస్ మూసివేతపై ఎస్ఎఫ్ఐ నేతలు నరేంద్ర, వినోద్ మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు విద్యార్థులతో కలిసి తరగతులు బహిష్కరించారు. ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజీలోని రెండు మెస్‌లలో ఫస్టియర్ విద్యార్థుల మెస్ మాత్రమే తెరిచారన్నారు. సెకండియర్ వారి మెస్ మూసివేసి సుమారు కిలోమీటర్ దూరంలోని ఈ–బ్లాక్ మెస్‌కు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ ప్రాంగణంలో చిరుత సంచారం నేపథ్యంలో విద్యార్థులు అంత దూరం వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారన్నారు. దీనిపై ప్రిన్సిపల్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అశోక్ కుమార్, మాధవ్ కృష్ణ, వీరేష్, సాయి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు డిమాండ్



మాట్లాడుతున్న సురేంద్రనాథ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : వరికి గిట్టుబాటు ధర కల్పించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ ప్రసాద్ చౌదరి డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో 4 లక్షల ఎకరాలు, తిరుపతి జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2,320 లభించక ఇబ్బందిపడుతున్నారని ఆరోపించారు. రైస్‌మిల్లర్లు, దళారీలు కుమ్మక్కై రైతులను దగా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో కిసాన్ మోర్చా నేతలు గాలి ప్రకాష్ నాయుడు, వెంకట సుధాకర్ రాజు పాల్గొన్నారు.

గుండెనొప్పికి ఉచితంగా మందు



టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్

భాకరాపేట : గుండె నొప్పికి ఖరీదైన టెనెక్ట్ ప్లస్ మందును ఉచితంగా రోగులకు వేయనున్నట్లు చిన్నగొట్టిగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నా పెద్ద తేడా లేకుండా గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయన్నారు. మారిన జీవనశైలి, ఆహార అలవాట్ల కారణంగా హార్ట్ ఎటాక్ వస్తోందని తెలిపారు. గుండెపోటు వచ్చినప్పుడు తొలి గంటలో రూ.45వేల విలువైన టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్ ఇస్తే రోగి ప్రాణాలు కాపాడవచ్చని వెల్లడించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు ఉచితంగానే ఈ మందు ఇస్తున్నట్లు వివరించారు.

ఉమాకాంత్‌కు డాక్టరేట్



తిరుపతి తుడా : స్విమ్స్ వర్సిటీ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి వి.ఉమాకాంత్ డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ ఉమామహేశ్వరి పర్యవేక్షణలో ఆయన 'డిజైన్ ఆఫ్ టీడ్స్ టూ మ్యానేజ్ పార్కిన్‌సన్ డిసీజ్ త్రూ ట్రాన్స్‌స్క్రిప్టోమిక్ అనాలసిస్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు

ఎంబీఏ ఫలితాల విడుదలకు వినతి



వీసీకి వినతిపత్రం అందిస్తున్న భార్గవ్ సాయి

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో గత ఏడాది ఆగస్ట్‌లో నిర్వహించిన ఎంబీఏ రెండో సెమిస్టర్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని జైభారత్ నేషనల్ పార్టీ రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భార్గవ్ సాయి కోరారు. బుధవారం ఈ మేరకు వీసీ సీహెచ్ అప్పారావుకు వినతి పత్రం అందించారు. భార్గవ్‌సాయి మాట్లాడుతూ పరీక్షలు జరిగి ఆరు నెలలు గడిచినా ఫలితాలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అబ్బాస్, కల్యాణ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు




విశేషాలంకరణలో అమ్మవారు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చినిగేపల్లెలోని కట్టమీద గంగమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సహదేవరెడ్డి, నాగలక్ష్మి సర్పంచ్ సింహాల విమలమోహన పాల్గొన్నారు.

తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఒకప్పుడు వివిధ జాతుల పిచ్చుకలు దర్శనమిచ్చేవి. సమూహంగా ఎగురుతూ కనువిందు చేసేవి. చెరువుల సమీపంలోని చెట్లు.. ఇళ్ల వాకిట్లో గూడు కట్టుకుని నివసించేవి. అయితే నగరీకరణ నేపథ్యంలో పిచ్చుక జాతి క్రమేణా కనుమరుగవుతోంది. జీవ వైవిధ్యం దెబ్బతినడంతో అంతరిస్తోంది. నీటి గుంతలు కబ్జాకోరల్లో చిక్కుకోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. అక్కడక్కడా అపార్ట్‌మెంట్ వద్ద ఏసీ కంప్రెషర్ కింద భాగమే ఆవాసంగా ఉనికిని చాటుకునే దుస్థితి దాపురించింది. గతంలో నట్టింట విహరించిన ఈ పక్షి జాతిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గూడు కరువై.. జాడ లేని పిచ్చుక





- కనుమరుగవుతున్న జాతి
- జీవ వైవిధ్యం దెబ్బతినడమే కారణం
- కలుషిత వాతావరణమే ప్రధాన అవరోధం
- కాంక్రీట్ జంగిల్‌లో గూళ్లకు లేని అవకాశం

తిరుపతి మంగళం : క్షీణ దశలో ఉన్న పక్షి జాతుల్లో పిచ్చుక ప్రధానంగా ఉంది. ముఖ్యంగా నగర వాతావరణంలో వీటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఒకప్పుడు పిచ్చుక సమూహాలకు తిరుపతిలో కొదవే ఉండేది కాదు. అయితే గత 20 ఏళ్లుగా వాటి మనుగడకు అవరోధాలు పెరిగిపోయాయి. నగరీకరణతో పాటు కాలుష్యం అధికం కావడంతో పిచ్చుకల జాడ లేకుండా పోతోంది. ఒక సర్వే ప్రకారం ఈ జాతి పక్షుల్లో 70 శాతం తగ్గుదల నమోదైంది. మానవుడితో మమేకమై జీవనం సాగించే పిచ్చుకల సంరక్షణ జనం చేతుల్లోనే ఉందని నిపుణులు, పరిశోధకులు చెబుతున్నారు.

నీటి వనరులే కేంద్రం

పక్షిజాతుల మనుగడకు కొలనులు, సరస్సులు, చెరువులే కేంద్రం. గతంలో తిరుపతి నగరంలో నీటి స్థావరాలకు కొదవలేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి విభిన్న జాతుల పక్షులు సైతం వలస వచ్చేవి. కానీ, ప్రస్తుత పట్టణీకరణ నేపథ్యంలో చెరువులు, కుంటలు మాయమవ్వడంతో పక్షి జాతుల మనుగడపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిచ్చుకలను హౌస్ స్పారోస్ అంటారు. అంటే ఇవి మనుషుల ఇళ్ల వద్దే చిన్న గూడు నిర్మించుకుని వాటి సంతతిని వృద్ధి చేసుకుంటాయి. అయితే కాంక్రీట్ జంగిల్ మారిన నగరంలో పిచ్చుకలను ఆదరించే వారే కరువయ్యారు.

గూడుకు లేని అవకాశం

ఇళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, స్కూళ్లు, పార్కులు, భవనాల బాల్కనీల్లో ఎక్కువగా పిచ్చుకలు గూడు కట్టుకుంటాయి. అయితే వాటి గూడుకు నగరవాసులు అవకాశం ఇవ్వకపోవడంతో ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. అక్కడక్కడ ఏసీ సందుల్లోనో, పార్కింగ్ ఏరియాల్లోనో, గూడు పెట్టుకున్నా నగరవాసులు వాటిని తొలిగిస్తుండడంతో ఉనికి క్రమేణా కోల్పోతున్నాయి. పర్యావరణ పరిస్థితులను అంచనా వేయడంలో పక్షి జాతుల మనుగడను కూడా ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ క్రమంలో నగరంలో జీవ వైవిధ్యం పూర్తిగా దెబ్బతింటోందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో పిచ్చుకల సంఖ్య భారీగా తగ్గిపోయిందని, అందుకే ఆ రాష్ట్ర పక్షిగా పిచ్చుకను ఎంపిక చేసి వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వివరిస్తున్నారు. నాసిక్‌లో మొహమ్మద్ దిలావర్ అనే పక్షి ప్రేమికుడు పిచ్చుకల సంరక్షణ కోసం చేసిన కార్యక్రమాల ఫలితంగా ఏటా మార్చి 20వ తేదీన ప్రపంచ పిచ్చుక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ఐరోపాలోని పట్టణాలు, నగరాల్లో పిచ్చుకలు ఎక్కువగా కనిపిస్తాయి. ఒక సర్వేలో భాగంగా యూకేలో గ్రామీణ ప్రాంతాల్లో 47శాతం. పట్టణ ప్రాంతాల్లో 60శాతలం పిచ్చుకలు తగ్గాయని వెల్లడించారు. ఈ కారణాలతో ఈ జాతిని యూరోపియన్ కన్జర్వేషన్ కన్సర్న్ జాబితాలో చేర్చారు.

ఆహార కొరత కూడా..



నగర వాతావరణంలో పిచ్చుకలకు ఆహార లభ్యత తగ్గిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి మనుగడ ప్రశ్నార్థకంగానే మారింది. పంట పొలాలకు వినియోగించే క్రిమి సంహారకాలు వీటిని బలిగొంటున్నాయి. గతంలో పిచ్చుకల ఉనికిని అంచనా వేసేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, బెంగళూరు, తమిళనాడులో సర్వే చేశారు. అందులో పిచ్చుల సాంద్రత హెక్టారుకు 15 నుంచి 335వరకూ ఉంటుందని నిర్ధారించారు. అయితే ఈ సంఖ్య ప్రస్తుతం ఇంకా తగ్గిపోయింది.

సంతతి తగ్గింది

"కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో పిచ్చుకలను ఆదరించే వారు కరువయ్యారు. కాలుష్యం పెరిగిపోవడంతో పిచ్చుకలు అదృశ్యమవుతున్నాయి. పల్లెల్లో ఒకప్పుడు ధాన్యం కుప్ప నూర్చే వాళ్లు. ఇప్పుడు మిషన్లు వచ్చాయి. అలాగే ఇళ్ల ముందు పిండితో ముగ్గులు పెట్టేవారు. ఇప్పుడు అది కూడా లేకుండా పోయింది. దీంతో పక్షులకు ఆహారం కొరత అధికమైంది. ఈ క్రమంలోనే గూడు కట్టుకునే వెసులుబాటు లేకుండా పోతోంది. పట్టణాల్లో జీవనం కరువై అనువైన ప్రాంతాలకు వెళ్లిపోయాయి. అయినప్పటికీ వాటి సంతతి మాత్రం బాగా తగ్గిపోయింది.

– కార్తీక్, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ (బర్డ్స్‌మన్)

భగవద్గీతపై అవగాహన



మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

తిరుపతి కల్చరల్ : భారతీయ విద్యాభవన్ పుస్తక ప్రదర్శన మహోత్సవంలో భాగంగా బుధవారం సాంస్కృతిక వేదికపై భగవద్గీతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి భగవద్గీత సారాంశాన్ని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ గాలి గుణశేఖర్ మాట్లాడుతూ భగవద్గీత గొప్పతనం తెలియజేశారు. వైష్ణవాం ప్రీం సేవక్ దాసు ప్రభు మాట్లాడుతూ విజయానికి మార్గం భగవద్గీత అని వెల్లడించారు. విద్యాభవన్ సంచాలకుడు డాక్టర్ ఎన్.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ భగవంతుడు ఇచ్చిన అద్భుత గీతం భవద్గీత అని వివరించారు.

వెంకటరమణకు డాక్టరేట్



తిరుపతి సిటీ : తిరుపతిలోని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌డీఎస్) వ్యవస్థాపకుడు బి.వెంకటరమణ అమెరికాలోని ఐస్‌లాండ్ స్ప్రింగ్ ఫీల్డ్ వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఇమ్యూనిటీస్ అండ్ సెర్చ్ డిస్క్రిప్షన్ ఇన్ టెస్ట్ మనీ వేర్ ఆఫ్ దెన్ కాజుడ్ డిగ్రీ టు బి ఇన్ ప్రింటెడ్ అనే అంశంపై ఆయన పరిశోధన పత్రాలు సమర్పించారు.

ధాన్యం కొనుగోలుకు వినతి

తిరుపతి అర్బన్ : రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా కమిటీ సభ్యులు కోరారు బుధవారం ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందించారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న వివిధ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని వ్యవసాయ, రైతు, కార్మిక సంఘాల నేతలు మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నేతలు వందవాసి నాగరాజు, మాంగాటి గోపాల్‌రెడ్డి, పి.హేమలత, కె.రాధాకృష్ణ, బాలసుబ్రమణ్యం, విజయ్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు టి.సుబ్రమణ్యం , ఎస్.మాధవకృష్ణ, పి.మునిరాజు పి.బుజ్జి, చిన్న, నరేంద్ర, రమేష్, మురళి, సాయిలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు, కేవై.రాజా, వైఎస్.మణి, గోవిందస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తేజోవతి

తిరుపతి కల్చరల్ : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం మబ్బు సూర్యనారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జేపీ డెంటల్ అండ్ సూర్య స్కిన్ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ తేజోవతి, డాక్టర్ జయప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం 95 మంది పదో తరగతి విద్యార్థులకు డిప్యూటీ డీఈఓ బాలాజీ, ఎంఈఓ భాస్కర్ నాయక్ చేతుల మీదుగా స్టడీ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మునిశేఖర్పాల్గొన్నారు.

మృతదేహం కోసం స్విమ్స్ వద్ద ధర్నా



స్విమ్స్ ఎదుట ధర్నా చేస్తున్న సుబ్రమణ్యం రెండో భార్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

తిరుపతి తుడా/నారాయణవనం: తండ్రి మృతదేహాన్ని తమకు కాకుండా తొలి భార్యకు నిబంధనలకు విరుద్ధంగా అప్పగిస్తున్నారంటూ రెండో భార్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తిరుపతి స్విమ్స్ వద్ద బుధవారం రాత్రి బైఠాయించి ధర్నా చేశారు. నారాయణవనం మండలం చిత్తూరుకండ్రిగకు చెందిన రిటైర్డ్ ట్రాన్స్‌కో డీఈ సుబ్రమణ్యం(80) రెండో భార్య కుమారుడు నవీన్, గ్రామస్తుల కథనం మేరకు.. సుబ్రమణ్యంకు పద్మతో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత పద్మ భర్త నుంచి విడిపోయి వేరుగా ఉంటోంది. సుబ్రమణ్యం చిత్తూరుకండ్రిగకు చెందిన జానకిని రెండో వివాహం చేసుకుని 30 ఏళ్లుగా తిరుపతిలో ఉంటున్నాడు. మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్రమణ్యంకు రెండో భార్య జానకి, ఆమె కుమారుడు నవీన్‌లే స్విమ్స్‌లో చికిత్స చేయిస్తున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన సుబ్రమణ్యంను జానకి, నవీన్‌లు మంగళవారం సాయంత్రం స్విమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం సుబ్రమణ్యం మృతి చెందాడు. ఈ సమాచారాన్ని మొదటి భార్య పద్మకు చేరవేశారు. సుబ్రమణ్యం అంత్యక్రియలు ఆయన చివరి కోరికైన స్వగ్రామంలో ఇరుకుటుంబాలు కలిసి చేసుకోవాలని బంధుమిత్రులు సూచించారు. మృతదేహం తమకే అప్పగించాలని మొదటి భార్య పట్టుబట్టింది. సీఎం పేషీ నుంచి ఫోన్ వచ్చిందంటూ స్విమ్స్ డైరెక్టర్ పీఏ చెప్పడంతో మృతదేహాన్ని పద్మకు అప్పగించడాన్నికి సిద్ధమయ్యారు. దీంతో నవీన్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మిత్రులు బుధవారం రాత్రి ధర్నాకు దిగారు. తొలి నుంచి వైద్య సేవలు చేయిస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తన తండ్రి వదిలేసి వెళ్లిపోయిన మొదటి భార్యకు మృతదేహాన్ని ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. మృతదేహం కోసం సీఎం పేషీ నుంచి ఫోన్ వచ్చిందంటూ బాధ్యతాయుతమైన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎలా అప్పగిస్తారని గ్రామస్తులు స్విమ్స్ వైద్యులను ప్రశ్నిస్తున్నారు. అడ్మిట్ చేసిన తమకే సుబ్రమణ్యం మృతదేహాన్ని అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారు దేవేరులతో పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ దర్శనమివ్వనున్నారు. తెప్పోత్సవాల్లో భాగంగా తొలి రోజు శ్రీకోదండరామస్వామి, 7వ తేదీ శ్రీరుక్మిణ సత్యభామ సమేత శ్రీపార్థసారథిస్వామి వారు, 8న ఆండాళ్ అమ్మవారితో కలిసి శ్రీకృష్ణస్వామి వారు, 10, 11,12వ తేదీల్లో శ్రీగోవిందరాజస్వామి వారు తెప్పలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. చివరి రోజు తెప్పోత్సవం అనంతరం ఎదురు ఆంజనేయస్వామి వారి సన్నిధికి స్వామివారు వేంచేపు చేయనున్నారు.

ఫిరాయింపుదార్లపై వేటు

- వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచి కూటమిలోకి ఫిరాయించిన కార్పొరేటర్లు, నేతలపై పార్టీ అధిష్టానం వేటు వేసింది. బుధవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. 10వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి గుప్తసాయిప్రతాప్‌రెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, 32వ డివిజన్ కార్పొరేటర్ సి.శైలజ, 33వ డివిజన్ కార్పొరేటర్ దూది కుమారి, 43వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రాధ, నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, తిరుత్తణి వేణుగోపాల్, దూది శివప్రసాద్, ఆవుల మురళీయాదవ్‌ను వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

లేబర్ కోడ్ వ్యతిరేక సదస్సులు



మాట్లాడుతున్న హేమలత

తిరుపతి కల్చరల్ : లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మార్చి 18న దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నట్లు సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు కే.హేమలత తెలిపారు. బుధవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడిదారులకు పెద్ద పీట వేయడమే లేబర్ కోడ్‌ల ఉద్దేశమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఆక్రమణకు చెక్



జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

చంద్రగిరి : మండలంలోని పత్తి గుట్ట వద్ద విలేకర్లకు మంజూరు చేసిన స్థలాలను ఆక్రమించేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం తిరుపతి చెందిన ఓ వృద్ధాశ్రమం పేరిట అక్రమార్కులు కబ్జాకు చేసేందుకు పత్తిగుట్టకు చేరుకున్నారు. జేసీబీ సాయంతో స్థలం చదును చేస్తుండగా సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పత్తిగుట్ట స్థలంలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ ఆక్రమణకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని తహసీల్దార్ శివరామసుబ్బయ్య స్పష్టం చేశారు.

మోసగాడి అరెస్ట్

తిరుపతి క్రైమ్: గోవిందరాజస్వామి ఆలయం వెనుక ఎస్‌బీఐ ఏటీఎం దగ్గర వృద్ధులను మోసం చేస్తున్న ఓ వ్యక్తిని సెక్యూరిటీ గార్డ్ పట్టుకుని బుధవారం పోలీసులకు అప్పగించాడు. వివరాలు.. ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలోని ఏటీఎం వద్ద కలికిరికి చెందిన రమణ అనే వ్యక్తి వృద్ధులను టార్గెట్ చేసేవాడు. వారికి సాయం చేస్తున్నట్లు నటిస్తూ ఏటీఎం కార్డును తస్కరించి డమ్మీ కార్డు ఇచ్చేవాడు. వారు వెళ్లిన తర్వాత నగదు డ్రా చేసేవాడు. అయితే దీనిని గమనించిన అక్కడ సెక్యూరిటీ సిబ్బంది, అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఎంవీఐ అతికానాజ్

తిరుపతి అర్బన్ : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం డీపీటీఓ కార్యాలయంలో ఆర్టీసీ ఉద్యోగులు, మహిళా కండక్టర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. డీపీటీఓ నరసింహులు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఎంవీఐ అతికానాజ్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కండక్టర్లు సైతం ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రధానంగా ప్రయాణికులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బస్సును రివర్స్ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడం సామాజిక బాధ్యతగా భావించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, డీఎం బాలాజీ, అసిస్టెంట్ మెకానిక్ ఇంజినీర్ కళ, చాందిని పాల్గొన్నారు.

ఘనంగా 'ఎమ్మెస్ ఇంటర్నేషనల్' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి తుడా : తిరుపతి రాఘవేంద్ర నగర్‌లోని ఎంఎస్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఫౌండర్ డాక్టర్ మంజువాణి, డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్కూల్ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. మంజువాణి మాట్లాడుతూ స్కూల్ పాటిస్తున్న విద్యా ప్రమాణాలను వివరించారు.

సకాలంలో పన్ను వసూలు



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం అధికారులతో కమిషనర్ మౌర్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సకాలంలో పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని స్పష్టం చేశారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పరిశుభ్రత తప్పనిసరి

సచివాలయాల పరిశుభ్రంగా ఉంచుకోవడం తప్పనిసరని కమిషనర్ స్పష్టం చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాళ్లపల్లి కూడలి, ఎల్‌బీ నగర్, పద్మావతి నగర్, సరస్వతి నగర్, మునిరెడ్డి నగర్, తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

13 నుంచి ఎల్ఆర్ఎస్, బీపీఎస్ మేళా

తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ(తుడా) ఆధ్వర్యంలో ఈనెల 13,14,15 తేదీల్లో మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. 2020 పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ 2020), 2019 బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ 2019) కు సంబంధించి పెండింగ్ లో ఉన్న వాటిని పరిష్కరించేందుకు మరో అవకాశం ఇస్తున్నామని వెల్లడించారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి 6 గంటల వరకు తుడా కార్యాలయానికి రావాలని సూచించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



మహిళా క్రికెటర్ స్మృతి మంధాన



హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జయరాం ఠాకూర్

తిరుమల: శ్రీవారిని బుధవారం మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జయరాం ఠాకూర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.